సాక్షి
అనంతపురం
సోమవారం । 19 । మే । 2025



అగ్రి కోర్సులతో పచ్చని కెరీర్
అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులు విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నాయి. కోర్సు పూర్తి కాగానే ఉద్యోగాలు దక్కుతున్నాయి. 8లో



ఎక్సైజ్ సీఐపై బదిలీ వేటు
తన అవినీతిని బయటపెట్టిన ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ హసీనాబానుపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.8°/21.9°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేయాలన్నారు. సమస్యపై గతంలో అర్జీ ఇచ్చి ఉన్నట్లయితే అందుకు సంబంధించి రసీదు తీసుకురావాలని సూచించారు.

42 కేంద్రాలు.. 11,493 మంది విద్యార్థులు

- నేటి నుంచి పది సప్లిమెంటరీ




అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 42 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,493 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పాత సిలబస్ మేరకు రాసే విద్యార్థులకు ఇదే చివరి అవకాశం అని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకుని ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని కోరారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను ద్విచక్ర వాహనాల్లో పంపొద్దని కోరారు. బస్సులు, ఆటోల్లో పంపాలని కోరారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇదిలాఉండగా ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఆరు కేంద్రాలు, ఇంటర్ విద్యార్థులకు 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,998 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వీరికి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని డీఈఓ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

కసాపురంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



నెట్టికంటి ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామునే నెట్టికంటుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారిని తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ కే.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గోపూజను ఘనంగా నిర్వహించారు. గోమాతకు నూతన వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ యాగశాలలో 108 కలశాలను ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ముఖ మండపంలో నెట్టికంటి ఆంజనేయస్వామి వారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి తులసీదళముతో లక్షార్చన నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల సంఖ్య పెరగడంతో ఆలయ అధికారులు ఆ మేరకు ఏర్పాట్లను చేపట్టారు.



గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడులో రక్తపుటేరులు

- వరుస హత్యలకు తెగబడుతున్న టీడీపీ గూండాలు
- 2015లో భూమిరెడ్డి శివప్రసాదరెడ్డి దారుణ హత్య
- 2018లో కందుకూరు శివారెడ్డిని నరికి చంపిన 'పచ్చ' నేతలు
- ఈ ఏడాది మార్చి 30న పాపిరెడ్డిపల్లిలో పరిటాల బంధువుల చేతిలో హత్యకు గురైన లింగమయ్య
- తాజాగా రాప్తాడులో దంపతులను కిరాతకంగా చంపిన 'పచ్చ' గూండాలు



అంత్యక్రియలకు తీసుకెళ్తున్న నారాయణ రెడ్డి, ముత్యాలమ్మ మృతదేహాలను చూసి రోదిస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్ పడగ విప్పింది. టీడీపీ గూండాల చేతిలో ప్రత్యర్థులు దారుణ హత్యకు గురవుతున్నారు. అధికారం చేపట్టిన నాటినుంచి పరిటాల కుటుంబం సాగిస్తున్న ఈ దమన కాండకు సామాన్య, మధ్య తరగతి రైతులు బలవుతున్నారు. 2014–19 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు నేతలను దారుణంగా హత్య చేసిన పరిటాల వర్గీయులు.. 2024లో అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోశారు. రాప్తాడు నియోజకవర్గాన్ని రక్తపు మడుగులో తడిపేస్తున్నారు. 2019–24 మధ్య ప్రశాంతంగా బతికిన పల్లెలు ఇప్పుడు వేట కొడవళ్ల పదునుకు కకావికలమవుతున్నాయి. పరిటాల రవి హయాం నాటి హత్యలు మళ్లీ గుర్తుకొస్తున్నాయని సామాన్యులు భయాందోళన చెందుతున్నారు.

ఆ కుటుంబం ఎక్కడుంటే అక్కడ ఫ్యాక్షనే..

పరిటాల కుటుంబం ఎక్కడున్నా కక్షలు, హత్యలు అన్నట్టు సాగుతోంది. 2014–19 మధ్య ఎమ్మెల్యేగా గెలిచిన పరిటాల సునీత మంత్రి అయ్యారు. అప్పటికే తనయుడు శ్రీరామ్ దూకుడుగా ఉన్నారు. ఆ తరుణంలోనే వైఎస్సార్‌సీపీ నేత భూమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డిని 2015 ఏప్రిల్ 29న రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలోనే టీడీపీ వర్గీయులు దారుణంగా నరికి చంపారు. నిందితులు అప్పట్లో ప్రస్తుత అనంతపురం ఎమ్మెల్యే, అప్పటి రాప్తాడు ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్ కారులో వెళ్లి శివప్రసాద్‌రెడ్డిని చంపారు. పరిటాల వర్గీయులు చేసిన ఈ హత్య అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

శివారెడ్డినీ పొట్టనపెట్టుకున్నారు..

కందుకూరు శివారెడ్డి.. ఈ పేరు వింటే ఉచిత మంచి నీరు గుర్తుకొస్తుంది. రాజకీయంగా ఎదుగుతున్న ఆయన్ను చూసి ఓర్వలేక దారుణంగా చంపారు. పొలం నుంచి వస్తుండగా పరిటాల వర్గీయులు వేట కొడవళ్లతో నరికి హతమార్చారు. ఇటీవల ఈ కేసులో ఐదుగురు ముద్దాయిలకు యావజ్జీవ శిక్ష పడింది. శిక్ష పడటానికి కొన్ని రోజుల ముందు కూడా రాజీకి రావాలని బాధితులపై పరిటాల కుటుంబం ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

లింగమయ్యను చంపిన పరిటాల బంధువులు..

తమకు వ్యతిరేకంగా పనిచేస్తే ఎవరినైనా చంపుతామనే ధోరణితో స్వయానా పరిటాల బంధువులు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను ఈ ఏడాది మార్చి 30న ఉగాది రోజున దారుణంగా హత్య చేశారు. 'మాకు వ్యతిరేకంగా పని చేస్తావా?! నీకు ఎంత ధైర్యం' అంటూ ఇంటిపైకి వెళ్లి మరీ లింగమయ్యను చంపారు. అంతకుముందే లింగమయ్య కొడుకుపై దాడికి తెగబడ్డారు.

తాజాగా రైతు దంపతులు..

రాప్తాడులో నివాసముంటున్న రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, భార్య ముత్యాలమ్మ శనివారం దారుణ హత్యకు గురయ్యారు. కొన్ని రోజులుగా పొలం విషయంలో నారాయణరెడ్డికి, టీడీపీ వర్గీయులకు తగాదా ఉంది. ఈ నేపథ్యంలో శనివారం పొలంలోకి వెళ్లిన నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ వర్గీయులు వేటకొడవళ్లతో నరికి చంపారు. బాధిత కుటుంబ సభ్యులు నిందితుల పేర్లు చెప్పడానికి కూడా భయపడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అదుపుతప్పిన శాంతిభద్రతలు..

ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాల్లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. లింగమయ్య హత్యకు ముందు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఆయన బలయ్యారు. హత్యానంతరం కూడా పోలీసులు అదే ధోరణితో వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో హెలీప్యాడ్ ఘటన విషయంలో 71 మందిపై కేసు నమోదు చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రివర్స్ కేసులు పెడుతున్నారు. తాజాగా దంపతుల హత్యతో పోలీసుల డొల్లతనం బయటపడింది. గ్రామాల్లో టీడీపీ నేతలు భయానక వాతావరణం సృష్టించి దాడులకు తెగబడుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.



తల్లిదండ్రుల మృతదేహాల వద్ద రోదిస్తున్న ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి



అశ్రునయనాలతో అంత్యక్రియలు

రాప్తాడు: టీడీపీ మూకల దాష్టీకానికి బలైన రైతు దంపతులు చిగిచెర్ల ముత్యాలమ్మ, చిగిచెర్ల నారాయణ రెడ్డి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వారి తోటలో మృతదేహాలను ఖననం చేశారు. సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం రాప్తాడులోని నివాసం వద్దకు ముత్యాలమ్మ, నారాయణ రెడ్డి మృతదేహాలను తీసుకురాగా.. నివాళులర్పించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద కుమారులు ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కలచివేసింది. 'ఇక మాకు దిక్కెవరు' అంటూ కన్నీరుమున్నీరవుతున్న వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. మృతదేహాలను వారి స్వగ్రామం గొల్లపల్లి తీసుకెళ్లగా.. అక్కడా దంపతులను కడసారి చూసేందుకు గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. అనంతరం మృతదేహాలను తోటలోకి తీసుకెళ్లి ఖననం చేశారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం



దంపతుల మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: 'కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి, మీకు ఏ సమస్య వచ్చినా మా కుటుంబం అన్ని విధాలా అండగా ఉంటుంది' అంటూ ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డిలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి ఓదార్చారు. ముత్యాలమ్మ, నారాయణ రెడ్డి మృతదేహాలకు పూలమాలలు వేసి తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. దంపతుల కుమారులను పరామర్శించారు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మృతి చెందడం బాధాకరమన్నారు. ఏ సమస్య వచ్చినా తాను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మండల మాజీ యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, గొల్లపల్లి సర్పంచు హనుమంత రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామంలో చిగిచెర్ల నారాయణ రెడ్డి, ముత్యాలమ్మ మృతదేహాలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తిరోగమనంలో ఆదర్శం

- మోడల్ ఇంటర్ ప్రవేశాలకు 22న ముగియనున్న దరఖాస్తు గడువు
- ఆరు స్కూళ్లలో డబుల్ డిజిట్ కూడా దాటని దరఖాస్తులు
- ప్రభుత్వ విద్యావిధానాలే కారణమని సర్వత్రా విమర్శలు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వ చర్యలతో విద్యా వ్యవస్థ తిరోగమనం దిశగా సాగుతోంది. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు అందుతున్న దరఖాస్తులను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోడల్ స్కూళ్లలో సీట్ల కోసం పోటీ ఉండగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఇప్పటి దాకా 1,890 దరఖాస్తులు..

జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)ల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 22న దరఖాస్తు గడువు ముగియనుంది. జిల్లాలో మొత్తం 15 మోడల్ జూనియర్ స్కూళ్లు ఉండగా అన్నింటిలోనూ దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆశించిన మేర దరఖాస్తులు రావడం లేదు. దాదాపు ఆరు మోడల్ స్కూళ్లలో దరఖాస్తుల సంఖ్య డబుల్ డిజిట్ కూడా దాటని పరిస్థితి నెలకొంది. 15 మోడల్ స్కూళ్లలో శనివారం నాటికి మొత్తం 1,890 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించారు. జిల్లాలోనే అత్యధికంగా రాయదుర్గం ఏపీ మోడల్ స్కూల్‌కు 245 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో గుత్తిలో 222 దరఖాస్తులు, పామిడి 177, గార్లదిన్నె 158, కళ్యాణదుర్గం 158, తాడిపత్రి 153, రాప్తాడు 125, పుట్లూరు 111, ఉరవకొండ 111, వజ్రకరూరు 82, శెట్టూరు 57, కణేకల్లు 56, యల్లనూరు 53, విడపనకల్లు 27, యాడికిలో 10 దరఖాస్తులు వచ్చాయి.



రాయదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్

ప్రభుత్వ చర్యలతో విద్యార్థుల దూరం..

మోడల్ స్కూళ్లలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఒక్కో మోడల్ స్కూల్‌లో 160 దాకా సీట్లు ఉంటాయి. దరఖాస్తుల తీరును చూస్తే విడపనకల్లులో 27, యాడికిలో కేవలం 10 దరఖాస్తులు రావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఎంతో నమ్మకం చూపేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా తీసుకుంటున్న చర్యలతో తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ విద్యా సంస్థల్లో తమ బిడ్డలను చేర్పించేందుకు మొగ్గు చూపడం లేదు.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్–2025 సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కంప్యూటర్ ఆధారిత (ఆన్‌లైన్) విధానంలో ప్రవేశ పరీక్ష ఉంటుంది.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ (బైపీసీ) విద్యార్థులకు ఈ నెల 19, 20 తేదీల్లో, ఇంజినీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ)కి సంబంధించి పరీక్షలు 21 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయి. రోజూ ఉదయం(9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు), సాయంత్రం (మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5) రెండు సెషన్లలో పరీక్షలు సాగుతాయి.

అనంతలో పరీక్ష కేంద్రాలు ఇవే:

ఎస్ఆర్ఐటీ కళాశాల(రోటరీ పురం), ఎస్వీఐటీ (హంపాపురం), అనంతలక్ష్మి (ఇటుకలపల్లి), పీవీకేకే (రుద్రంపేట), నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చి సోషియల్ యాక్షన్ ఇండియా (చిన్మయ నగర్, ప్రసన్నాయపల్లి), గేట్స్ (గుత్తి), సీవీ రామన్ (తాడిపత్రి), తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల

- విద్యార్థులు ఏపీఈఏపీసెట్ –2025 దరఖాస్తు కాపీలోని నిర్దేశిత బాక్స్‌లో కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే రోజున సదరు కాపీతో పాటు హాల్‌టికెట్ తీసుకెళ్లాలి.
- బ్లూ, బ్లాక్ కలర్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్ హాల్‌టికెట్, పాస్‌పోర్టు, పాన్/ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాల్లో ఏదో ఒక ఒరిజినల్ తీసుకుని వెళ్లాలి. ఇవి మినహా ఇతర వస్తువులను అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి, ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ...

ఏపీ ఈఏపీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

దంచికొట్టిన వాన



విడపనకల్లు మండలం పాల్తూరు–దర్గాహొన్నూరు మార్గంలో మోరీపై పారుతున్న వరదనీరు

- జిల్లాలోని 31 మండలాల పరిధిలో 33.3 మి.మీ సగటు వర్షపాతం
- ఉరవకొండ డివిజన్‌లో కుండపోత
- పంటలకు తీవ్ర నష్టం

అనంతపురం అగ్రికల్చర్: ఈ సీజన్‌లో తొలిసారిగా జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 31 మండలాల పరిధిలో ఏకంగా 33.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఉరవకొండ డివిజన్‌లో వరుణుడు దంచికొట్టాడు. విడపనకల్లు మండలంలో 95.4 మి.మీ, ఉరవకొండ 89.2, వజ్రకరూరు 86.2 మి.మీ వాన పడింది. అలాగే, బెళుగుప్ప 75.4 మి.మీ, బొమ్మనహాళ్ 67.4, బ్రహ్మసముద్రం 56.4, గుంతకల్లు 52.6, గుమ్మఘట్ట 52.2, కణేకల్లు 46.8, రాయదుర్గం 45.6, కూడేరు 42.4, గార్లదిన్నె 37.6, యల్లనూరు 34.6, శెట్టూరు 31.6, అనంతపురం 30.2, డీ.హీరేహాళ్ 27.2, పామిడి 22.4, ఆత్మకూరు 20 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో కూడా మోస్తరు వర్షం కురిసింది. వర్షాలకు పలు చోట్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. కణేకల్లు మండలం రచ్చుమర్రిలో పిడుగుపడి రెండు దున్నపోతులు, ఒక పాడి ఎనుము మృతి చెందాయి. మరో రెండు పోతులకు కాళ్లు విరిగాయి.

మొద్దునిద్రలో వ్యవసాయశాఖ...

జిల్లా అంతటా ఇటీవల మంచి వర్షాలు కురిశాయి. 10 రోజుల్లో 'ఖరీఫ్' మొదలు కానుంది. నైరుతి రుతుపవనాలు కూడా ప్రవేశించనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రానున్నాయి. రైతులు భూములు దుక్కులు చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో అన్నదాతలను సాగుకు సిద్ధం చేయడంపై అటు కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఇటు వ్యవసాయశాఖ కూడా మొద్దునిద్ర పాటిస్తుండటం సమస్యగా తయారైంది. రాయితీ విత్తనాల పంపిణీ ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదు. రాయితీలు, ధరలు కూడా ఖరారు చేయలేదు. విత్తనశుద్ధి, సరఫరా, పంపిణీ ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సకాలంలో రైతు ముంగిటకు విత్తనాలు, ఎరువులు సమకూర్చాల్సిన బాధ్యతను కూటమి ప్రభుత్వం, వ్యవసాయశాఖ విస్మరించాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





కణేకల్లు మండలం నాగేపల్లి వద్ద తడిసిన వరిధాన్యాన్ని చూపుతున్న రైతులు, రచ్చుమర్రిలో మృతి చెందిన రెండు దున్నపోతులు, ఒక పాడి గేదె

కలెక్టర్ చెబితే వినాలా..?

- సర్వజనాస్పత్రి 'ఎన్ఆర్‌సీ'లో కానరాని మార్పు



పాల కోసం ఎదురు చూస్తున్న చిన్నారి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రీషినల్ రీహాబిలిటేషన్ సెంటర్(ఎన్ఆర్‌సీ)లో తీరు మారడం లేదు. 'చిన్నారులకు అందించే డైట్‌పై నిర్లక్ష్యం చేయకూడదు' అని ఇటీవల సాక్షాత్తు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా పెడచెవిన పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ ఆకలితో అలమటిస్తున్న పిల్లలను చూస్తే అయ్యో అంటూ జాలిపడాల్సిందే. ఆరోగ్య శాఖ.. సర్వజనాస్పత్రి అధికారుల బాధ్యతారాహిత్యం చిన్నారులకు శాపంగా మారింది. గ్లాసు పాల కోసం మూడు నాలుగు గంటలపాటు వేచి ఉండాల్సి వస్తోంది. ఇక.. ఎన్ఆర్‌సీలో వంట మనిషి లేకపోవడంతో రోజూ ఉదయం, మధ్యాహ్నం పాయసంతోనే అల్పాహారాన్ని సరిపెడుతున్నట్లు తెలిసింది.

ఇదిగో సాక్ష్యం..

పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న తన ఇద్దరు బిడ్డలను (ఒకరు మూడేళ్లు, ఒకరికి 7 నెలలు) తాడిపత్రికి చెందిన శ్రావణి ఎన్ఆర్‌సీలో చేర్పించింది. ఈ పిల్లలకు ఉదయం 6 గంటలకే ఎన్ఆర్‌సీలో సిబ్బంది పాలు పంపిణీ చేయాలి. కానీ ఆదివారం 9 గంటలైనా ఇవ్వలేదు. దీంతో పిల్లలు కడుపు కాలి ఏడుస్తుండటంతో చేసేదిలేక శ్రావణి ఆస్పత్రి బయట ఇడ్లీ తీసుకుని వచ్చి వారి పొట్ట నింపింది. మరో మహిళ కూడా తన బిడ్డ బాధను చూసి తట్టుకోలేక బయట తోపుడు బండ్లపై దోసె తీసుకువచ్చి ఆకలి తీర్చింది. ఇటీవల 'సాక్షి'లో 'చిన్నారుల ఆకలి కేకలు' శీర్షికన కథనం ప్రచురితం కాగా.. ఆ మరుసటి రోజు వైద్య ఆరోగ్యశాఖాధికారులు, సర్వజనాస్పత్రి అధికారులు ఎన్ఆర్‌సీకి వచ్చి హడావుడి చేశారు. ఆ తర్వాత నుంచి షరామామూలుగానే పరిస్థితి తయారైంది.



ఆహారం ఎంతసేపటికీ ఇవ్వకపోవడంతో బయట ఇడ్లీ కొనుగోలు చేసి బిడ్డకు తినిపిస్తున్న శ్రావణి

రెండు రోజులు సర్దుకో..

'ఎన్ఆర్‌సీలో ఉంటే మంచి తిండి పెడతారని చెప్పారు. కానీ ఇక్కడేమో ఆ పరిస్థితి కనిపించడం లేదు సార్' అంటూ ఓ వృద్ధురాలు ఇటీవల డ్యూటీ వైద్యున్ని ప్రశ్నించగా.. సదరు వైద్యుడు 'రెండు రోజులు సర్దుకోండహే' అంటూ నిర్లక్ష్య సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. వాస్తవంగా అతను విధులకు ఎప్పుడూ గైర్హాజరవుతుంటాడని, కళ్యాణదుర్గం బైపాస్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తుంటాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. న్యూట్రీషియన్లు సౌజన్య, పల్లవి కూడా విధులకు తరచూ డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. గతంలోనూ ఓ న్యూట్రీషియన్ సెలవులో వెళ్లి, జీతం మాత్రం తీసుకున్నట్లు తెల్సింది. రూ.లక్షలు జీతాలు తీసుకుంటూ చిన్నారుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న వారిపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లుప్తంగా

వ్యవసాయ శాఖలో బదిలీల కోలాహలం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయశాఖలో బదిలీల కోలాహలం మొదలమైంది. జూన్ 2వ తేదీ లోపు అన్ని విభాగాల్లో బదిలీలు పూర్తి చేయాలని తాజాగా ఆదేశాలు అందాయి. నిబంధన మేరకు ఒక ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాలి. మిగిలిన వారు కూడా రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఏఈఓ, ఏఓ, ఏడీఏ, డీడీఏ, మినిస్టీరియల్ స్టాఫ్, వాచ్‌మెన్, అటెండర్ తదితర అన్ని విభాగాల్లోనూ బదిలీల ప్రక్రియ ఉండటంతో ఎవరికి వారు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫారసుల కోసం పాకులాడుతున్నట్లు తెలిసింది. కొన్ని స్థానాలకు ఉద్యోగుల మధ్య పెద్ద ఎత్తున పోటీ ఉండటంతో డబ్బు ఖర్చు చేయడానికి సైతం వెనుకాడటం లేదని చెబుతున్నారు. ఇదే అదనుగా ఆ శాఖ ఉన్నతాధికారులు, అసోసియేషన్ నాయకులు, అధికార పార్టీకి చెందిన చోటామోటా నేతలు అంతో ఇంతో వెనుకేసుకునేందుకు ఉద్యోగులకు వల విసురుతున్నట్లు సమాచారం.

చెరువులో పడి బాలుడి మృతి


పృథ్వీ మృతదేహం

బుక్కరాయసముద్రం: ప్రమాదవశాత్తు చెరువు నీట మునిగి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం చెదుళ్ల గ్రామానికి చెందిన గంగాదేవి, కృష్ణ దంపతులు చెన్నైలో స్థిరపడ్డారు. అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో కృష్ణ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల గ్రామంలో పెద్దమ్మ జాతరకని స్వగ్రామానికి వచ్చారు. వీరి ఆరేళ్ల వయసున్న కుమారుడు పృథ్వీకి మానసిక పరిపక్వత లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సైకిల్ తొక్కుకుంటూ గ్రామ శివారులోని శింగనమల చెరువు బ్యాక్ వాటర్ వద్దకెళ్లిన పృథ్వీ... అక్కడ సైకిల్‌ను కడిగేందుకని సిద్ధమై నీటిలో దిగాడు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. బాలుడు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తూ చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే నీటిలో తేలియాడుతున్న పృథ్వీ మృతదేహాన్ని గమనించి బోరున విలపిస్తూ వెలికి తీశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అగ్రి కోర్సులతో పచ్చని కెరీర్

- తక్కువ ఫీజులకే కోర్సులు
- త్వరలో అగ్రి పాలిటెక్నికల్ కోర్సులకు నోటిఫికేషన్

టెన్త్ తర్వాత ఇంటర్.. అది పూర్తికాగానే ఇంజనీరింగ్ లేదా మెడిసిన్... మనలో చాలా మంది ఆలోచన ఇదే. అయితే ప్రస్తుత మార్కెట్ అవసరాల దృష్ట్యా సర్టిఫికెట్ కోర్సులకూ భారీగా డిమాండ్ నెలకొంది. పది, ఇంటర్ తర్వాత పలు సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేస్తే తక్కువ సమయంలోనే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. ఇలాంటి కోర్సుల్లో అగ్రికల్చర్ కోర్సులు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి.


రెడ్డిపల్లిలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల



బుక్కరాయసముద్రం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రూ.లక్షల్లో ఖర్చు పెట్టి ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారి కంటే అతి తక్కువ ఖర్చుతో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసిన వారు తొందరగా ఉద్యోగాలు దక్కించుకుని జీవితంలో స్థిరపడుతున్నారు. అలాంటి సర్టిఫికెట్ కోర్సుల్లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులు ముందు వరుసలో నిలుస్తున్నాయి. వ్యవసాయాధిరిత అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఖర్చుతో మంచి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2 ఏళ్ల కోర్సు పూర్తి చేస్తే ఎంత లేదన్నా.. మరో 2 ఏళ్లలో ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకం ఇప్పటికే ప్రజల్లో పాతుకుపోవడంతో రోజురోజుకూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, కళ్యాణదుర్గం కేవీకేలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు అనంతపురం, కదిరి, తాడిపత్రిలో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

కావలసిన విద్యార్హతలు..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పెద్దగా విద్యార్హతలతో పని లేదు. ప్రధానంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉంటే చాలు. ఆసక్తి ఉన్న వారు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ఈ నెలాఖరులోపు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దరఖాస్తు చేయడానికి, మరింత సమాచారానికి https:// angrau.ac.in/ వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సి ఉంటుంది.

సీట్ల కేటాయింపు, ఫీజులు ఇలా..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిబంధనలు వర్తిస్తాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు, అంగవైకల్యం కలిగిన వారికి 3 శాతం సీట్లు కేటాయించారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ అర్హత దక్కిన వారు ఏడాదికి రూ.8,800 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హాస్టల్ వసతి కావాలనుకునేవారు రూ.11వేలు డిపాజిట్ చేయాలి. కోర్సు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్మును వెనక్కు చెల్లిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో అయితే రూ.29 వేలు ఫీజు, హాస్టల్‌కు రూ.5,500 చెల్లించాలి. కళాశాలలో చేరే విద్యార్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంను పూరించి జనరల్ విద్యార్థులు అయితే రూ.500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులైతే రూ.250 డీడీ తీసి అందజేయాలి.

అగ్రికల్చర్ కోర్సులు ఇవే

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల నుంచి మూడేళ్ల కాల వ్యవధి ఉన్న పలు కోర్సులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా..

కోర్సు	కాల వ్యవధి
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్	3 ఏళ్లు
డిప్లొమా ఇన్ హోంసైన్స్	3 ఏళ్లు

ఉజ్వల భవిష్యత్తు



అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఈ కోర్సులు అభ్యసిస్తే సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి గాను త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందజేయాలి. ఉజ్వల భవిష్యత్తు ఉన్న అగ్రి కోర్సులు పూర్తి చేసిన వారు ఆధునాతన వ్యవసాయం, డెయిరీ ఫాం, పాడి, ఎరువుల కంపెనీలు, వ్యాపారం వంటి రంగాలను ఎంచుకుని జీవితంలో స్థిరపడవచ్చు.

– డాక్టర్ వసుంధర, ప్రిన్సిపాల్, రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

కాలవ ఓ వేస్ట్ కార్డు

- విప్ కాలవపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న వై.శివరామిరెడ్డి

గుంతకల్లు టౌన్: టీడీపీలో వేస్ట్ కార్డ్ ఎవరైనా ఉన్నారంటే అది రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాత్రమేనని, ఒకప్పుడు మంత్రిగా పనిచేసిన ఆయనను ప్రస్తుతం ప్రభుత్వ విప్ పదవికి మాత్రమే సీఎం చంద్రబాబు పరిమితం చేయడమే ఇందుకు నిదర్శనమని మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవాపై చర్చకు తాను సిద్ధమని ప్రతి సవాల్ విసిరితే అందుకు బదులివ్వాల్సిన కాలవ వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడడాన్ని ఎమ్మెల్సీ తప్పుబట్టారు. తాను బెస్ట్ కార్డు కావడం వల్లనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తన ముగ్గురు సోదరులు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నప్పటికీ తమ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి తనకు ఎమ్మెల్సీ పదవి అప్పగించారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కాలవ చెప్పిన తేదీ ప్రకారమే ఉరవకొండలోనే ప్రజలు, మీడియా సమక్షంలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో భీమలింగప్ప, నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారు


అశ్వవాహనంపై విహరిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవేరులతో కలసి అశ్వవాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష అభిషేకాలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ఈఓ రమేష్ బాబు, ప్రధాన అర్చకుడు ద్వారకానాథ చార్యులు పర్యవేక్షించారు.

ఎక్సైజ్ సీఐపై బదిలీ వేటు

కళ్యాణదుర్గం రూరల్: తన అవినీతిని బయట పెట్టిన ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ హసీనాభానుపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. మూడురోజుల క్రితం కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫీస్ బాయ్ సాయి అలియాస్ నానిపై సీఐ చెప్పుతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పలు రాజకీయ పార్టీల నేతలు, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి హసీనాభాను అవినీతి, అక్రమాలు బయటపడడంతోనే ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టినట్లుగా నిర్ధారించారు. దీంతో ఆమెను ఉరవకొండ బార్డర్ మొబైల్ పార్టీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆమెపై ఉన్నతాధికారుల లోతైన విచారణ కొనసాగుతోంది. పూర్తి స్థాయి నివేదిక అందిన తర్వాత ఆమెపై కఠిన చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

మచ్చుకత్తులతో గొంతుకోసి..

- రాయదుర్గంలో యువకుడి హత్య
- శరీరం నుంచి తలను వేరు చేసిన దుండగులు


వినోద్‌కుమార్ (ఫైల్)

రాయదుర్గం: మండలంలోని కొంతానపల్లికి చెందిన టైలర్ వినోద్‌కుమార్ (22) దారుణ హత్యకు గురయ్యాడు. మచ్చుకత్తులతో గొంతు కోయడంతో శరీరం నుంచి తల వేరుపడింది. పోలీసులు తెలిపిన మేరకు... కొంతానపల్లికి చెందిన ఆంజనేయులు, అంజినమ్మ దంపతుల ఏకైక కుమారుడు వినోద్‌కుమార్ టైలర్ వృత్తితో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. స్వగ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్న వినోద్‌కుమార్... ఇటీవల ఊరిదేవర సమయంలో గ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి ఇంటి పట్టునే ఉంటూ ఇక్కడే టైలర్ వృత్తిని కొనసాగిస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొనేందుకు శనివారం వచ్చాడు. ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. ఆదివారం తెల్లవారుజామున కొంతానపల్లి గేట్ వద్ద చింతమాను వద్ద వినోద్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయనాయక్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మచ్చుకత్తితో గొంతు కోసి హతమార్చినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. స్నిఫర్ డాగ్స్‌ను రంగంలో దించి నిందితుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విత్తన కేటాయింపులో కోత తగదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప


విలేకరులతో మాట్లాడుతున్న ఓ.నల్లప్ప

అనంతపురం అర్బన్: జిల్లాలో ఖరీఫ్ కింద అత్యధికంగా సాగులోకి వచ్చే వేరుశనగ పంటను ప్రభుత్వం తక్కువగా అంచనా వేసి సబ్సిడీ విత్తన వేరుశనగ కేటాయింపులో కోతలు విధించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. కేటాయింపు పెంచి 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవనల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ విత్తన కాయ గత ఏడాది 76,710 క్వింటాళ్లు కేటాయించి, ప్రస్తుత ఖరీఫ్‌కు 54,184 క్వింటాళ్లు కేటాయించడంతో రైతులు ఆందోళనకు గువుతున్నారన్నారు. ప్రభుత్వం విత్తన కేటాయింపులు పెంచి జిల్లాలో కరువు పరిస్థితులు దృష్ట్యా 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయ పంపిణీ చేయాలన్నారు. అలాగే కందులు, ఉలవ, ఇతర ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఒకేసారి ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నుంచి హనుమప్ప సస్పెన్షన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ బి.హనుమప్పను రెండేళ్ల పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సబ్ కమిటీల్లో ఏర్పడిన రెండు ఖాళీలను రాష్ట్ర కమిటీ అప్రజాస్వామికంగా భర్తీ చేసిందంటూ ఇటీవల జిల్లాలో పత్రికలకు హనుమప్ప ప్రకటనలు ఇచ్చారన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర కమిటీ తీవ్రంగా పరిగణించి సంజాయిషీ కోరుతూ ఇచ్చిన నోటీసుకు ఆయన సరైన సమాధానం ఇవ్వనందున రెండేళ్ల పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు.


'కేఎస్ఎన్' కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చేరాలనుకునే విద్యార్థినులకు ఇదొక మంచి అవకాశం అన్నారు. నాలుగు ఎకరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల భవనం ఉందన్నారు. ప్రతి తరగతి గదితో పాటు ఆవరణలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 2022 ఏప్రిల్ 'ఏ'గ్రేడ్ గుర్తింపు పొందిందన్నారు. హాస్టల్ వసతి ఉందన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. యోగా, పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. నూతన విద్యా విధానం అమలులో భాగంగా మేజర్, మైనర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు నేరుగా కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. పూర్తి వివరాలకు 94404 18274, 94415 52643, 93980 30817 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోర్సుల వివరాలు ఇలా...	
బీఏ	హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్‌సైన్స్.
బీకామ్	జనరల్, బీబీఏ, కంప్యూటర్ అప్లికేషన్
బీఎస్సీ	మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, ఎలక్ట్రానిక్స్, జర్నలిజం, పారామెడికల్ టెక్నాలజీ

ఆర్డీటీని కాపాడుకుందాం

- ప్రముఖ నేపథ్యగాయని మంగ్లీ


సంగీత కచేరి నిర్వహిస్తున్న మంగ్లీ తదితరులు

అనంతపురం కల్చరల్: ఎందరో నిరుపేదల్లో దాగి ఉన్న కళను వెలికి తీసి సమాజానికి పరిచయం చేసిన ఆర్డీటీని కాపాడుకుంటామని ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా జానపద కళాకారులైన ఆర్డీటీ పూర్వవిద్యార్థులు 'వి స్టాండ్ ఫర్ ఆర్డీటీ' పేరిట జానపద, శాస్త్రీయ సంగీత విభావరి నిర్వహించారు. శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, మృదంగం, ఘటం, వీణ, తబల, వోకల్ తదితర విభాగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, ఇందుకు ఆర్డీటీనే కారణమంటూ నినదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంగ్లీ మాట్లాడుతూ.. ఆర్డీటీ ద్వారా తాను ఎదిగిన తీరును వివరించారు. కష్టాల్లో ఉన్న మాతృ సంస్థకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది గాజుల పద్మజ ఆర్డీటీ ప్రాముఖ్యతను వివరించారు. ఆర్డీటీ ద్వారా లబ్ధి పొంది వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన సరిగమప కార్యక్రమ విజేత రేణుకుమార్, మంజునాథ్, శ్యామ్‌సన్, నారాయణస్వామి, సునీత, తిరుపతి, హైదరాబాదు, ఆదోని, మంత్రాలయం, జిల్లా వ్యాప్తంగా వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి

- వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి


ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానించిన ప్రవాసాంధ్రులు

అనంతపురం కార్పొరేషన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి మండిపడ్డారు. రెడ్‌బుక్ పేరుతో హింసాత్మక రాష్ట్రంగా ఏపీని మార్చిన కూటమి పెద్దలకు బుద్ధి చెప్పేందుకు ముందుకు రావాలని ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం సింగపూర్‌లో నిర్వహించిన గ్లోబల్ కనెక్ట్ సమావేశం విజయవంతమైంది. సాంబశివారెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ చెప్పిన విధంగానే రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయిస్తూ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశారని ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాం పేరుతో కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి సీఎం చంద్రబాబు కక్ష సాధింపులకు పాల్పడుతుంటే ఇందుకు బీజేపీ, జనసేన వెనుక నుంచి వత్తాసు పలుకుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలను చైతన్య పరిచేలా గణాంకాలతో కూడిన వివరాలను పోస్టింగ్ చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా యుద్ధం సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. కార్యక్రమంలో సింగపూర్ ఎన్ఆర్ఐ కన్వీనర్ మురళీకృష్ణ, కోటిరెడ్డి, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యను విచ్ఛిన్నం చేస్తున్న ప్రభుత్వం


సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

- తొమ్మిది రకాల పాఠశాలలతో తీవ్ర నష్టం
- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 21న డీఈఓ కార్యాలయ ముట్టడి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుల వెల్లడి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో గ్రామీణ విద్యను రాష్ట్ర ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తోందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఉపాధ్యాయ ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఐక్యవేదిక నిర్వాహక బాధ్యులు వైఎస్సార్‌టీఏ జిల్లా బాధ్యుడు నాగిరెడ్డి, ఆప్టా జిల్లా బాధ్యుడు వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈనెల 21న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన తొమ్మిది రకాల పాఠశాలల విధానంతో పేద విద్యార్థులకు భారీ నష్టం జరగనుందన్నారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి అశాస్త్రీయ నిబంధనలతో ఎవరికీ అర్థం కాని అగమ్య గోచరంగా మార్చేశారన్నారు. ఏమాత్రం శాస్త్రీయత, ఉపాధ్యాయ సానుకూలత లేకుండా, ప్రతి ఉపాధ్యాయుడు నష్టపోయేలా నిబంధనలు ఉన్నాయన్నారు. దశాబ్దాల వారీగా ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయులు సాధించుకున్న అన్ని రకాల హక్కులను కూటమి సర్కార్ కాలరాస్తోందన్నారు. ఉపాధ్యాయ చట్టం పేరుతో కొత్త విధానాలను తీసుకురావడం సరికాదన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్న 16 రకాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ లింగమయ్య, గోవిందరాజులు, ఎస్టీయూ రామాంజనేయులు, ఏపీటీఎఫ్ రాయల వెంకటేష్, సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ 1938 శ్రీనివాసనాయక్, పీఆర్టీయూ పురుషోత్తమరెడ్డి, ఆపస్ ఎర్రిస్వామి, హెచ్ఎం అసోసియేషన్ జయరామిరెడ్డి, మురళి, సోదర సంఘాల నాయకులు హరికృష్ణ, రవీంద్రనాయక్, శివానందరెడ్డి, నరసింహారెడ్డి, ఓబులేసు, వెంకటేశులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. పలువురికి గాయాలు


బోల్తా పడిన ఆటో

రాప్తాడు: ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మామిళ్లపల్లి వైపు నుంచి అనంతపురానికి ప్రయాణికులతో బయలుదేరిన ఆటో మరూరు టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి బోల్తా పడింది. గాయపడిన 8 మంది ప్రయాణికులను అంబులెన్స్‌లో సర్వజనాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం: స్థానిక లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని కురుబ కల్యాణమ మంటపం వెనుక ఉన్న పట్టాలపై ఆదివారం రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

మురళీధరరావు సేవలు వెలకట్టలేనివి



మురళీధరరావును సన్మానిస్తున్న అతిథులు

అనంతపురం కల్చరల్: విద్యార్థిగా, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా, సామాజిక సేవా కార్యకర్తగా మురళీధరరావు అందించిన సేవలు వెలకట్టలేనివని డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం ఫిల్మ్ సొసైటీ వారు మురళీధరరావు జీవిత విశేషాలతో రూపొందించిన లఘుచిత్ర ప్రదర్శన ఆర్ట్స్ కాలేజీలో జరిగింది. పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటూ కళాకారులు, వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు హాజరై చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సాగిన సమావేశానికి ప్రిన్సిపాల్ పద్మశ్రీ అధ్యక్షత వహించారు. భవిష్యత్తు తరాల వారికి వందేళ్ల చరిత్ర కల్గిన ఆర్ట్స్ కాలేజీ గొప్పతనాన్ని ఆదర్శ వ్యక్తిత్వం కల్గిన మురళీధర రావు చిరస్మరణీయంగా ఉండిపోయేట్లు చిత్రాన్ని నిర్మించినట్లు సినీ దర్శకుడు రషీద్‌బాషా తెలిపారు. అనంతరం ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డాక్టర్ అక్బర్ సాహెబ్, విజయనగర లా కాలేజీ శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ, రఘునాథరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పల్లవి, ఆశ్రయ కృష్ణారెడ్డి, కవి రియాజుద్దీన్ తదితరులు మురళీధరరావును ఘనంగా సత్కరించారు.

శ్రీ స్వరా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



శ్రీస్వరా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని మారుతీ నగర్ మూడవ క్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ స్వరా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ప్రారంభించారు. పేద ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన సేవలందించాలని సూచించారు. శ్రీ స్వరా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాకేష్ (కార్డియాలజిస్టు), జనరల్ సర్జర్ డాక్టర్ ఎండీ నాయక్, గైనకాలజిస్టు డాక్టర్ ఎం.శ్వేత మాట్లాడుతూ.. వివిధ విభాగాలకు సంబంధించి వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వివాహాలు



వివాహం అనంతరం జంటలతో పూజలు చేయిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి సమీపంలో ఉన్న సద్గురు యోగి నారాయణ మఠంలో ఆదివారం ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. దాతల సహకారంతో ఎనిమిది జంటలకు వివాహం చేశారు. వధూవరులకు తలంబ్రాల బట్టలతో పాటు తాళిబొట్టును ఉచితంగా అందజేశారు. అనంతరం వధూవరులు, వారి కుటుంబ సభ్యులకు సద్గురు యోగి నారాయణ మఠం వారు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి



పేరూరులో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రామగిరి: బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలను కొనసాగించాలని దళిత సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పేరూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, కళ్యాణదుర్గంతో పాటు చాలా గ్రామాల్లో ఆర్డీటీ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. విద్యార్థులకు చదువు చెప్పిస్తూ, నిరుపేదలకు ఇళ్లను నిర్మిస్తూ సేవ చేస్తోందని గుర్తు చేశారు. అలాంటి ఆర్డీటీ సేవలను పున రుద్ధరించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

ఆర్యవైశ్య హాస్టల్ కమిటీ కార్యదర్శిగా రమణ

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్యవైశ్య హాస్టల్ కమిటీ కార్యదర్శిగా ముడియం రమణ నియమితులయ్యారు. ఈయన 2028 వరకూ కార్యదర్శిగా కొనసాగనున్నారు. తనపై నమ్మకంతో హాస్టల్ కమిటీ కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు రమణ కృతజ్ఞతలు తెలిపారు. హాస్టల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



బసినేపల్లిలో నీరు నిలిచి మడుగును తలపిస్తున్న దృశ్యం

పట్టు తప్పితే బురదలో పడాల్సిందే..

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసినేపల్లిలో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులు వివిధ రకాల పనుల నిమిత్తం ఈ మార్గంలో ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, అనంతపురం, ఎన్ఎస్ గేట్ తదితర గ్రామాలకు వెళ్తుంటారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదాలకు గురికాక తప్పదు. ఇందులో ద్విచక్ర వాహనాలు వెళ్తే సగం వరకూ మునిగి పోతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి నీరు ఎక్కువగా నిలిచి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. నిత్యం ఈ దారిలో ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ఇక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కురుగుంట సచివాలయం వద్ద మొక్కుబడిగా ఏర్పాటు చేసిన చలివేంద్రం

కుండలు లేని చలివేంద్రం

రాప్తాడు రూరల్ : మండుతున్న వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జన సంచారం ఎక్కువగా ఉండే పంచాయతీల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. మండల కేంద్రంతో పాటు జన సంచారం ఎక్కువగా ఉండే పంచాయతీల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట సచివాలయం వద్ద 20 రోజుల క్రితం మొక్కుబడిగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం వద్ద తాగు నీరు కాదు కదా.. కనీసం కుండలు కనిపించక పోవడంతో ప్రజలు కంగుతింటున్నారు. దప్పిక తీర్చుకునేందుకు అక్కడికి వెళ్లిన ప్రజలు చలివేంద్రాన్ని చూసి ఉసూరుమంటున్నారు. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో ఇక్కడి చలివేంద్రం చూస్తే అర్థమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు.

అనంత మకుటం ‘నీలం’

- అనంత నుంచి హస్తిన వరకూ సాగిన సంజీవరెడ్డి ప్రయాణం
- జిల్లాకు విశేష ఖ్యాతి తెచ్చిన రాజకీయ దురంధరుడు

సందర్భం: నేడు నీలం సంజీవ రెడ్డి జయంతి



అనంతపురం కల్చరల్: శాసన సభ్యుడిగా, రాజ్య సభ సభ్యుడిగా, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, లోక్‌సభ స్పీకర్‌గా అన్నింటికీ మించి దేశ ప్రథమ పౌరుడిగా అనితర సాధ్యమైన బాధ్యతలను నీలం సంజీవరెడ్డి నిర్వర్తించారు. అనంత పేరు ప్రఖ్యాతలను ఢిల్లీలో మార్మోగించారు. ‘అనంత’ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసిన అతి కొద్దిమందిలో నీలం సంజీవ రెడ్డి అగ్రగణ్యుడు. అనంత నుంచి హస్తిన వరకు సాగిన ఆయన రాజకీయ ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆ తరానికి చెందిన రాజకీయ నాయకులు కావడంతో విలువలకు ప్రాధాన్యత ఇచ్చి పదవులను తృణప్రాయంగా వదిలేసి ఆదర్శప్రాయుడయ్యారు. సోమవారం నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలు మీకోసం..

స్ఫూర్తిదాయకం–నిక్కమైన నీలం

జిల్లాలోని మారుమూల గ్రామమైన ఇల్లూరులో నీలం సంజీవరెడ్డి 1913లో ఇదే రోజున జన్మించారు. తన 16వ ఏట 1929లో గాంధీ మహాత్ముడు జిల్లా పర్యటనకు వచ్చినపుడు ఆయన ప్రసంగాలకు ప్రభావితుడై స్వాతంత్రోద్యమంలోకి వచ్చారు. 1931లో జాతీయోద్యమంలో ప్రవేశించారు. 1946లో మద్రాసు అసెంబ్లీ సభ్యుడయ్యారు. 1947లో భారత రాజ్యాంగ సభ్యుడిగా ఎన్నికయ్యారు. చాలా మంది రాజ్యాంగ రచన అంటే అంబేడ్కర్ ఒకరే అనుకుంటారు. అనంత తరపున రాజ్యాంగ నిర్మాణంలో సంజీవరెడ్డి, కేఎం రహంతుల్లా కూడా కీలక పాత్ర పోషించారని కొందరికే తెలుసు. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో 1949 నుంచి 1952 వరకూ మద్యపాన నిషేధ శాఖ మంత్రిగా పని చేశారు. 1952లో రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రకాశం మంత్రి వర్గంలో 1955లో బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలోనూ ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. 1959లో భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. 1962లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. బస్సుల జాతీయికరణ అంశం న్యాయస్థానం పరిశీలనకు తలొగ్గి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో ఉక్కు గనుల శాఖమంత్రిగా, ఇందిరా గాంధీ మంత్రి వర్గంలో రవాణా, విమానయాన శాఖమంత్రిగా సేవలందించారు. హిందూపురం నుంచి లోక్‌సభ సభ్యుడై 1967–69 మధ్య స్పీకర్‌గా ఉన్నారు. 1977లో నంద్యాల నుంచి లోకసభకు ఎన్నికై 1977 మార్చి నుంచి జూలై వరకూ స్పీకర్‌గా ఉన్నారు. అదే ఏడాది జూలై 25 నుంచి 1982 జూలై 24 వరకూ భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. పిన్న వయస్కుడైన రాష్ట్రపతిగా పని చేసిన ఘనత కూడా ఆయనదే.

శ్రీకంఠం సర్కిల్‌లో విగ్రహం ఏర్పాటు

ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నికై ఆ పదవికే వన్నె తెచ్చిన ఆయన విరమణ అనంతరం ఆయన కుటుంబం స్థానిక కోవూర్ నగర్‌లో ‘నాగవిహార్’లో స్థిరపడ్డారు. చాలా కాలం ఆయన ఇక్కడే నివసించి 1996 జూన్ 1న మరణించారు. ఆయన బ్రతికి ఉన్న రోజుల్లోనే శ్రీకంఠం సర్కిల్‌లో ఆయనకు శిలావిగ్రహం ఏర్పాటు చేశారు. ఆయన సహచరులుగా, శిష్యులుగా ఉన్నవారు ఇప్పటికీ ఆయన విలువలను స్మరించుకుంటూనే ఉంటారు. ఆయనకే కాదు.. నిరాడంబరంగా ఉండటం వారి కుటుంబానికే చెల్లింది. రాష్ట్రపతి కుటుంబ సభ్యులన్న గర్వం కూడా లేకుండా వారు జీవిస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పూజల అనంతరం స్వామి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: రాబోయే వర్షాకాలంలో మూర్ఛ వ్యాధి రోగులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జేవీవీ నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గిల్డ్‌ఆఫ్ సర్వీస్ స్కూల్ ఆవరణలో మూర్ఛ వ్యాధి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ.. సమయానికి అనుగుణంగా మందులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. మూర్ఛ వ్యాధి రోగులు డాక్టర్ల సలహాలు పాటిస్తూ ఆరోగ్యం పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శిబిరం కన్వీనర్ రామకృష్ణ, డాక్టర్ హరికిషోర్, జేవీవీ నగర అధ్యక్షులు ఎం.రామిరెడ్డి, నాయకులు టీచర్ నాగరత్నమ్మ, తిరుపాలు, ముత్యాలు, ప్రసాద్ రెడ్డి, ఎర్రిస్వామి, రాధాకృష్ణ, నూర్ మహమ్మద్, శివ, చరణ్, మన్సూర్ పాల్గొన్నారు.

‘హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు’



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకూడదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి, తిరిగి అక్కడి నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీతో మరణించిన వారిని గుర్తు చేస్తూ క్యాండిల్ ర్యాలీని ఏటా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది మేము గుర్తించుకుంటాం.. మేం మాట్లాడతాం, మేము నడిపిస్తాం అనే నినాదంతో ఈ స్మారక దినాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణ స్వామి, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ రామాంజనేయులు, లింక్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పనలో విఫలం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

శింగనమల: రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మండిపడ్డారు. ఆదివారం పుట్లూరులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటివ్ గుప్పిట్లో ఉంచారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెద్దయ్య, సీఐటీయూ నాయకులు రాఘవరెడ్డి, వెంకట చౌదరి, జే.పెద్దయ్య, ఆదినారాయణ, రంగప్ప , నాగముని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు



బహుమతి అందుకుంటున్న రైతు

ముదిగుబ్బ: మండలంలోని నాగారెడ్డిపల్లిలో గ్రామ ఉత్సవాల సందర్భంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో నిడిమామిడి గ్రామానికి చెందిన సురేష్ ఎద్దులు ప్రథమ, లింగప్పగారిపల్లికి చెందిన రాజా నాయుడు ఎద్దుల ద్వితీయ, అదే గ్రామానికి చెందిన రెడ్డప్పగారి చలపతి ఎద్దులు తృతీయ, బ్రాహ్మణపల్లికి చెందిన ఎర్రబల్లి సూరి ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. ఎద్దుల యజమానులకు ఆదివారం ఎంపీపీ ఆదినారాయణ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై వేంకటరమణుడి దర్శనం



అశ్వవాహనంపై ఊరేగిన ప్రసన్న వేంకటరమణ స్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీవారి పార్వేటోత్సవం, అశ్వవాహనోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సతీసమేతంగా శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రెడ్డి సంక్షేమ సంఘం, అరే కటిక, నాయీబ్రహ్మణ, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో శ్రీవారి అశ్వవాహన సేవ నిర్వహించారు. సోమవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం శ్రీవారి మయూర వాహనోత్సవం జరుగుతుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, గౌని శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్ గౌని లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాక మహోత్సవం



యల్లమ్మతల్లి, యర్రగుంటప్ప తదితర స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని ఆత్మకూరు గ్రామంలో గ్రామస్తులు ఆదివారం చంద్రగుత్తి యల్లమ్మ తల్లి సాక మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. గ్రామానికి చెందిన ఆకులేటి, తాళ్ల, బ్యాళ్ల వారు అమ్మవారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి ఆభరణాలతో అందంగా అలంకరించిన అమ్మవారితో పాటు కోడేకండ్ల పెద్దయ్యస్వామి, పూలఓబయ్యపల్లి తాటిచెర్లప్ప స్వామి, ఆత్మకూరు యర్రగుంటప్పస్వామి, బండ్లపల్లి తాడిపత్రప్పస్వామి విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉదయం 8.30 నుంచి ఉదయం 9.30 గంటల మధ్యలో అమ్మవారి పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో 3వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వతరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎస్టీలకు 32, ఎస్సీలకు 05, బీసీలకు 02, ఓసీలకు 01 సీటు చొప్పు కేటాయించినట్లు తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులకు మాత్రమే మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 4వ తరగతిలో 40 సీట్లు, 5 వతరగతిలో 39 సీట్లు, 6వ తరగతిలో 35 సీట్లు, 7వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 18 సీట్లు, 9వ తరగతిలో 22 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 8008134805,9550330009లో సంప్రదించాలన్నారు.

మహిళ మృతి

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఈశ్వరమ్మ(52) అనే మహిళ ఆదివారం వేకువజామున మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం ఆరో రోడ్డుకు చెందిన ఈశ్వరమ్మ పని నిమిత్తం ఈ నెల 1న భర్తతో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కొత్తపేట గ్రామ శివారులో వెనుక కూర్చున్న ఆమె జారి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను గుత్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కూడేరు: మండల పరిధిలోని కుష్టురోగుల కాలనీ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కమ్మూరుకు చెందిన విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. కడదరకుంటకు చెందిన రామాంజనేయులు స్వల్పంగా గాయపడ్డాడు. విజయ్ అనంతపురం నుంచి కమ్మూరుకు, రామాంజనేయులు అనంతపురం వెళ్తుండగా ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. స్థానికులు విజయ్‌ను ఆటోలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్ విజయమ్మ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కమ్మభవన్‌లో ఆదివారం జరిగిన ఓ వివాహానికి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తల్లి, మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. వధూవరులు దివ్యశ్రీ, యతేంద్ర ప్రసాద్‌ను ఆశీర్వదించారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు విజయమ్మకు స్వాగతం పలికారు.

ప్రశాంత్ బాబుకు డాక్టరేట్



అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనలకు పడిగల ప్రశాంత్‌బాబుకు డాక్టరేట్ లభించింది. ఈనెల 17న జేఎన్‌టీయూలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈసీఈ పూర్తి చేసిన ప్రశాంత్‌బాబు రెవెన్యూశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు ‘ఇమేజ్ కంప్రెషన్ యూజింగ్ ఎస్ ట్రాన్స్‌ఫార్మర్’ అనే అంశంపై పరిశోధన చేశారు. నంద్యాలలోని ఆర్‌జీఎం కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టి.జయచంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతి ఒక్కరూ తమ పిల్లలని ఉన్నత చదువులు చదివించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కటిక జయరామ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీఓ హోంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఇందుకు తమ పిల్లలను చదివించక పోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. అప్పుడే మీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోసమోదిన్, సుబ్బరాయుడు, గోవింద రాజులు, ప్రకాష్ బాబు, రాజా రమేష్, శాంతి ముని, హృశికేష్, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, కేశవయ్య, మనోహర, నరసింహులు, శాంతి స్వరూప్, పుల్లయ్య, రామాంజినమ్మ, విజయ్ కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బందారు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా శాఖలో టీచర్లకు పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్నారని తెలిపారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదన్నారు. పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ–మెయిల్ పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, నాగేంద్ర, శ్రీనివాసులు, మీసాల నాగభూషణం, నారాయణ స్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

దళితులపై దాడులు హేయం

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో దళిత యువకుడిపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. తిరుపతిలో దళిత యువకుడిపై మూత్రం పోసి చిత్ర హింసలు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కారుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్య సమాజం తలదించుకోనేలా దళిత యువకుడిపై దాడి చేయడం అమానుషమని తెలిపారు. దుర్మార్గులకు శిక్ష పడకుంటే కుల, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సుగమంచి శ్రీనివాసులు, కేపీ రాజు, రామాంజనేయులు, కుమార్, సూర్యనారాయణ, రవి, నల్లప్ప, ఎర్రిస్వామి, ఓబులేసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.